"వొదులుతాలే, తీసుకెళ్లు," పెట్టెని పట్టుకుని తలుపు దగ్గరకి నడిచింది. అక్కడాగి, ఒక్కరవ్వ ఆలోచించి వెనకాల కొచ్చింది. ఆ పెట్టె బల్లమీద పెట్టి ఒక్కొక్క బొమ్మ తీసి, యిటుతిప్పి, అటుతిప్పి, చివరికి, కుంటికుక్కనీ, రెండు పటాలనీ యేరి, జడ్జీగారి కిచ్చింది.

"వీటిని తీసుకోపోనీ, నీకేమీవుండవద్దూ ఆడుకోడానికి, అన్నీ నేనే తీసుకొంతె, మలి మలి, నాన్నని తప్పకండా వొదలాలి, సత్తెంలాగు అబద్ధాలు చెప్పకూడదు. చెపితె, రెండుకల్లూ పోతాయి, నాకేం ?" అని వెళ్ళింది.

"యిన్నేళ్ళు జడ్జీపని న్యాయంగాచేసి, ఆఖరికి నేను కూడా లంచం తీసుకున్నాను. గీతతప్పుతుందా యెంతవారికైనా ?" అనుకున్నారు జడ్జిగారు.

[ఇంగ్లీషు కథ ననుసరించి]

★

# మనోహర ప్రజ్ఞ

విక్రమాదిత్యుడు, తన పన్నెండుగురు మంత్రులతో విజయ యాత్రలు సలిపి, త్రోవలో మిత్రుడైన కళింగ చక్రవర్తిని దర్శించాడు. బంగారుయేనుగుల సింహాసనంతోనూ, కోడిగుడ్డంత పెద్ద ముత్యాల తోరణాలతోనూ, నిరంతరము వెలిగే కెంపు కాగడాలతోనూ, కాశ్మీరపు విలువగల తివాసీలతోనూ అలంకరించిన భవనములో వీరి నందరినీ యశో వర్ధనుడు సత్కరించాడు. తన వైభవం వెళ్ళడయ్యేట్టు హంసనడక

పావురాళ్ళ కనుగుడ్లతో మాత్రమే, ఆడ కోవెలల గుండెలతోమాత్రమే, బంగారు చాపల తలలతో మాత్రమే, తయారైనకూరలూ, ముత్యాలలాగు మెరుస్తో మంచి రుచికలిగి వాసన స్వతహాగా కలిగిన బియ్యపు అన్నమూ, సింహళమునించి తెచ్చిన, పేరైనా తెలీని, అపురూపపు పలుకులతోనూ, జాపాన్ దేశపురాజు కాన్కగా యిచ్చిన పచ్చ కర్పూరముతోనూ, తయారైన పాయసాన్నీ ఒక్కొక్క రాజ్యం విలువచేసే పరిషియా బానిస కన్యలచేత వడ్డింపించాడు. అద్భుత నృత్య గానాదులతో వారిని మైమర పించి, గ్రీకుదేశపు ఉత్తమ ద్రాక్షారసంతో వాళ్ళనినింపి చివరికి పడకగదిలో వారిని ప్రవేశపెట్టాడు. ఆ గుండ్రని గదిలో, మధ్యనున్న పెద్ద స్థంభం చుట్టూ పదమూడు మంచాలు వేసి వున్నాయి. దూరంనించి కిన్నెరగానం మెల్లిగా వినిపిస్తోంది. దీపం కనపడని మృదువైన తెల్లని వెలుగు గదిని నింపింది. తమ యదట నృత్యంచేసిన వేశ్యల సౌకుమార్యాన్ని తలచు కుంటో, మొహమల్ పరుపుల మీద పడుకుని తలకెక్కిన సారాయి దివ్య మంత్రం వల్ల దీపించే ప్రభలతో ఒకర్నిమించి వొకరు ప్రజ్ఞలు కొట్టడం ప్రారంభించారు.

ముందు విక్రమాదిత్యు డన్నాడుకదా "యీ రాజు సైనికుల్లో బలిష్ఠుడైనవాణ్ణి గుర్రంమీద కూచోపెట్టి తలమీద నా కత్తితో ఒక్క దెబ్బ కొట్టానంటే, వాడూ గుర్రమూ సగానికి తెగి, కత్తి రెండు గజాలలోతు భూమిలో పాతుకోవాలి"

ప్రధానమంత్రి గజబలుడు,

"అరవైమంది యెత్తలేని యినపగుండుని యీ కోట గోడమీద వొంటిచేత్తో విసిరానంటే, అరవైగజాల మేద గోడ కూలాల"న్నాడు.

"ఈ సాయంత్రం మనం చూసిన పెద్ద ధ్వజ స్తంభాన్ని గడ్డిపోచ మల్లే చీల్చేస్తా"నన్నాడు, తేజసింహుడు ఆరుగురు బానిసలు జాగ్రత్తతో పదేళ్ళు పెంచిన నల్లని మీసాలు మెలేస్తో.

"యింతేనా గొప్ప ? గుడి గాలిగోపరాన్ని భుజంమీద పెట్టుకొని

సముద్రం దగ్గిరికి మోసుకుపోతా"నన్నాడు. వారు కత్తికాట్లు కనపడే తన భుజం చరుస్తో దండనాథుడు.

అమరాంతకుడు బిగ్గిరిగా నవ్వి "రాజుగారి తోటలో చెట్లన్నీ ఒక్క చేత్తో గంటలో పెరికేస్తా"నన్నాడు.

ప్రణయగంభీరు దేమన్నాడంటే !

"యశోవర్ధనుడు భోజనం చేస్తూ వుండగా అతనికి తెలీకుండా రత్న పళ్ళెంలోని ఫలహారాల నన్నిటిని తిని ద్రాక్షారసాన్నంతా తాగే స్తాను!"

"ఇంతేనా? ఆయనకి తెలీకుండా ముక్కుపట్టుకులాగి, చంపమీద కొట్టి యేడిపిస్తాను" అన్నాడు, వాసవదత్తుడు.

రూపావతంసుడు "రాజుగారి తోటలో పళ్ళన్నీ అరగంటలో తినేస్తా"నన్నాడు.

"యశోవర్ధనుడి బంగారు గిన్నెలన్నీ మళ్ళీ కిందపడకుండా యెగ రేసి అట్లానే పంపిస్తాన"న్నాడు భాస్కరామాత్యుడు.

"ఈ మహానది తోవను మళ్ళించి యీ పట్నపు రాజవీధిని వరదల పాలు చేస్తాను" అని ప్రగల్భం కొట్టాడు నృసింహదేవర.

రాజశేఖరు న్నాడు కదా,

"పన్నెండుమంది వీరుల్ని వరసగా నుంచో పెడితే, నా కత్తివిసురు వల్ల తగిలే గాలితో వాళ్ళందరినీ ముక్కుమన్నయ్యేట్టు పడేస్తాను."

అందరి ప్రజ్ఞలూ కాగా చివరికి, విక్రమాదిత్యుడి అనుంగుమంత్రి, యిరవైయేళ్ళ కుర్రవాడు, మనోహరమూర్తి మిగిలాడు.

"మనోహరా నువ్వేమీ ప్రజ్ఞ పట్టావా?" అని అడిగాడు, రాజు నవ్వుతో.

"తప్పకండా....విష్ణువర్ధనుడనే మహావీరుడి పేరు మీరందరూ వినే వుంటారు అతడు పండితుడు, దాత, మహా బలవంతుడు, సమస్త అవయవపుష్టి కలవాడు, ఆ దేశపు రాజుగారి యాభైమంది కుమార్తెల్నీ, ఒక్కసారిగానే పెళ్ళి చేసుకుని, రాత్రే యాభైమందికీ జవాబు చెప్పి సంపూర్ణ సంతుష్టి కలిగిందని చెప్పుకునేట్టు చేశాడు. యాభైమందిలో ఒకర్నీ మరిచిపోలేదు, ఒక్కరికీ లోపం చెయ్యలేదు, నేనూ అంత శక్తి గలవాణ్ణని నిర్ధారణ చేస్తాను."

"ఈ యశోవర్ధనుడికి కుమార్తె వొక్కతేకదా మరీ !"

"అయితేనేం ? ఆమెనే పెళ్ళాడి-విష్ణువర్ధనుడికి తీసిపోని సామర్థ్యం ఒక్క రాత్రిలోనే వ్యక్తపరిచినట్లు నిర్ధారణ చేస్తాను."

అంటూ వుండగానే ఆ గది మధ్యనున్న స్తంభం తెరుచుకొని వుగ్రనరసింహమూర్తివలె మండిపడుతో యశోవర్ధనుడు వొచ్చి వాళ్ళ ముందు నిల్చున్నాడు.

"దీనిలో నుంచి మీ డాబులు వింటున్నాను, నా ఆతిథ్యానికి చేసే వుపకారం యిదా? తిని వాసాలు లెఖ్ఖ పెడుతున్నారా? మంచి అతిధులే. రేపు పొద్దున లేవగానే మీలో యెవరు తనుపట్టిన ప్రజ్ఞను సార్థకపరచుకోరో వారి తల తీసేయిస్తాను" అంటో స్తంభంలో మాయమైనాడు.

మర్నాడు గొప్పసభ యేర్పాటయింది. యీ పదముగ్గుర్నీ రాజ సభకు తీసుకువెళ్ళారు. విక్రమాదిత్యు డిష్టదేవతని ఆరాధిస్తో నిలుచున్నాడు. సభా భవనం మధ్య పన్నెండుగురు మహామంత్రులతోనూ, యశోవర్థనుడు వాళ్ళని ప్రజ్ఞలను చూపమని ఆనతిచ్చాడు. పదిమంది మంత్రులూ తలో దోవనా వెళ్ళారు. వూపిరి బిగబట్టి ప్రజలు యేం జరుగుతుందోనని చూస్తున్నారు. అరగడియలో భూకుహరం బద్దలైనట్లు పెద్ద శబ్దమయింది. సభా స్థానపు పెద్ద స్తంభాలు, లావు గోడలు, బంగారు సింహాసనం వొణికాయి. ముత్యాల తోరణాలు, మాణిక్యదీపాలు తెగి కింద రాలాయి. వార్తాహరులు నాలుగువేపుల్నించీ వొచ్చి రాజుగారి పాదాలమీద పడ్డారు.

"మహాప్రభూ, అరవైగజాల కోటగోడ కూలింది."

"రాజాధిరాజా, ధ్వజస్తంభం ఎండుపుల్లలాగు విరిగింది గాలి గోపురం సముద్రంవేపు యెగిరిపోయింది."

"మహారాజా, రాజవీధిలోకి నది వరదలై ప్రవహించింది. ఇళ్ళలో చేపలూ, మొసళ్ళూ కాపర మేర్పరుచుకుంటున్నాయి; అదిగో కోటగోడని నదీప్రవాహం తట్టుతోంది."

"గుర్రంమీది సేనానీ, గుర్రమూ, రెండుగా చీలి భూమి రెండు గజాలలోతు బద్దలయింది."

"తోటంతా ధ్వంసం, ఒక్క మొక్కలేదు. మహావృక్షాలతో సహా సర్వనాశనమయింది"

"రుచికైనా ఒక్క పండుగాని, కాయగాని దొరకదు".

పవిత్రరూపిణి, సావిత్రిని, మనోహరమూర్తి హృదయాన నిల్పి తన ప్రతిజ్ఞ నెరవేర్చమని, ప్రార్థిస్తున్నాడు. కాని ఒక సందేహం పట్టుకుంది అతనికి.

"ఎట్లా యీ పనిలో సహాయపడమని పవిత్రకన్యని సావిత్రిదేవి నడగను? ఆమె యిట్లాంటి వరాలెవరికీ యిచ్చినట్లు శాస్త్రాలలో కన పడదు. అసలిట్లాంటి వ్యవహారం ఆమె కర్థమవుతుందా, ఆమె అనుభవంలో వుండివుంటుందా?"

"మనోహరమూర్తీ, మీరు కానీండి" అన్నాడు రాజు.

"మీ కుమార్తె అద్భుతసౌందర్య సంపదను తలుచుకుని, ఆమె దర్శనానికై ఉవ్విళ్ళూరుతున్నాను."

ఇద్దరికీ వివాహం జరిపారు, సాయంత్రం.

"ప్రతిజ్ఞ పాడైనా, వుద యూన శిరోహీనుడైనా ఒక్క రాత్రికి యీ

అద్భుత సౌందర్యాన్ననుభవిస్తాను గద! యుద్ధంలో చచ్చినా, కుళ్ళ రంభాభోగమేకద, ప్రతిఫలము! అయినా భయంలేదు. రాత్రి నా నిశ్చితాభిప్రాయమూ, అమోఘప్రయత్నమూ, సర్వసాక్షి సావిత్రి చూసి, నా పక్కన నిలవబడి నూతనోత్సాహాన్ని యివ్వకపోతుందా, ఆ దాసుల పాలిటి కల్పతరువు?" అనుకున్నాడు.

తెల్లవారి రాజకుమారినీ మనోహరమూర్తినీ యశోధరవర్మ సభలోకి రప్పించాడు. విక్రమాదిత్యుడూ మంత్రులూ వుచితాసనములమీద ఆసీనులై వున్నారు.

"ఏం మనోహరమూర్తీ, ప్రతిజ్ఞ నెరవేర్చుకున్నావా?" అని గర్జించారు రాజుగారు.

అతను మాట్లాడక, కళ్ళకిందనుంచి వధువువంక చూశాడు. ఆమె, పాలూ రోజాపువ్వులూ మరిపించే చంపల మీద యెరుపు చాయలు తాండవమాడుతో, వినీవినపడనట్లు,

"ఆ" అని తల వూయించింది.

అసామాన్య ప్రతిభావంతుడైన అల్లుణ్ణి సింహాసనం మీదనించి దూకి, కావిలించుకున్నారు రాజుగారు.

విక్రమాదిత్యుడు తటాలున ఆనందంతో వొచ్చి వధువును కౌగిలించుకుని, ఆమె చెవులో రహస్యంగా

"నిజమేనా?" అన్నాడు.

"మీ మంత్రి మనోహరుడు, నిజంగా మనోహరుడే! ఆ చతురుడి రసికత్వంలో వొళ్ళు మరచి లెఖ్ఖపెట్టడం మరిచిపోయాను. లోకమే మరిపించాడు........"

నూతనవధువుతో, పన్నెండుగురు మంత్రులతో విక్రమాదిత్యప్రభువు వుజ్జయినికి ప్రయాణమైనాడు.

★